భారంగా పంటల సాగు!

- పెరుగుతున్న పెట్టుబడులు
- అందని ప్రభుత్వ సాయం
- అప్పుల ఊబిలో రైతులు



- ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు నాగన్న. ఇతడికి ముకుందాపురంలో ఏడు ఎకరాలుంది. అందులో చీనీ చెట్లు సాగు చేస్తున్నాడు. కూటమి ప్రభుత్వం కొలువై నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే రైతు భరోసా ఇంకా ఇవ్వలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పంటల బీమా పథకం ద్వారా ఏటా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేది. కూటమి ప్రభుత్వం రైతులకు ఎటువంటి సాయం అందజేయక పోవడంతో పెట్టుబడులు భారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు?



గార్లదిన్నె: రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది. దీంతో అన్నదాతలు పంటల సాగుకు దూరమవుతున్నారు ఖరీఫ్, రబీ సీజన్‌లలో శింగనమల నియోజకవర్గం వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో పైగా పంటలు సాగు అవుతున్నాయి. అలాగే హార్టికల్చర్, వాణిజ్య పంటలు వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 50 శాతానికి పైగా ఉపాధి పొందుతున్నారు. పంట సాగు కోసం పెట్టుబడి ఖర్చులు ప్రతి ఏటా పెరిగి పోతుండగా అందుకు అనుగుణంగా దిగుబడులు రాకపోగా, ధరలు సైతం లభించని దుస్థితి నెలకొంది. దీంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ఆత్మస్థైర్యం కోల్పోయి పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరి కొంత మంది సాగుకు దూరమవుతున్నారు.

ఊసేలేని అన్నదాతా సుఖీభవ

ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలనూ ఊరించారు. సూపర్ సిక్స్‌లో ఒకటైన అన్నదాతా సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకంపైనా స్పష్టత ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పులు చేసి ఖరీఫ్ పంటలు సాగు చేసినా.. నేటికీ పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేసినా.. కూటమి ప్రభుత్వం తనవంతు నిధులు ఎందుకు విడుదల చేయడం లేదో అర్థం కావడం లేదని అన్నదాతలు నిట్టూరుస్తున్నారు.

రైతులపై జీఎస్టీ పిడుగు

ప్రధానంగా కేంద్రం క్రిమి సంహారక మందులపై 18 శాతం, యంత్ర పరికరాలపై 12 నుంచి 18 శాతం జీఎస్టీ అమలు చేస్తోంది. ఎరువులపై 5 శాతం పన్ను విధిస్తోంది. విత్తనాలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. పురుగుమందులు లావాదేవీలు సీజన్‌కు రూ.కోట్లలో జరుగుతుంటాయి. రైతులు వ్యవసాయ యంత్ర పరిక రాలు అధిక సంఖ్యలో కొనుగోలు చేస్తుంటారు. వీటిపై కేంద్రం అధిక శాతం జీఎస్టీ విధించడంతో నియోజకవర్గంలోని రైతులపై పెను భారం పడుతోంది. ప్రతి ఏటా పెట్టుబడి ఖర్చులు పెరగడం, మరో వైపు ప్రకృతి వైపరీత్యాలు, ఇంకో వైపు దిగుబడులు సరిగా రాకపోవడం వంటి కారణాలతో రైతులు నష్టాలు పాలవుతున్నారు. దీంతో చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరమై ఇతర రంగాల్లో పనులు చేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు ప్రత్యామ్నాయం లేకపోవడంతో కష్టమైనా, నష్టమైనా పంట సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

జీఎస్టీ నుంచి మినహాయించాలి



ప్రతి ఏటా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు ధరలు పెరుగుతుంటాయి. ప్రభుత్వం పన్నుల రూపంలో యంత్ర పరికరాలు, పురుగు మందులపై ఇష్టానుసారంగా ధలు పెంచుతోంది. రైతు బాగుండాలంటే వ్యవసాయ రంగాన్ని జీఎస్టీ నుంచి మినహాయించాలి.

– వెంకటశివారెడ్డి, రైతు, తిమ్మంపేట

ధరలు పెరగడంతో అవస్థలు



ప్రతి ఏటా ఎరువులు, పురుగు మందులు ధరలు పెరగడంతో రైతులు అవస్థలు పడుతున్నాం. అలాగే పురుగు మందులు, ఎరువులు షాపు యాజమాన్యాలు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగమే భారంగా మారుతోంది.

– అమరనాథ్ రెడ్డి, గుడ్డాలపల్లి

హామీలు నెరవేర్చాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి. రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం అందజేస్తామన్నారు. హామీ నెరవేర్చక పోవడంతో ఖరీఫ్ పంటలకు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాం.

– చెన్నారెడ్డి, జంబులదిన్నె

నివాళి



అనంతపురంలో రైతు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సాంబశివారెడ్డి, వీరాంజనేయులు

శింగనమల: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు రైతులకు ఆలూరు సాంబశివారెడ్డి నివాళులర్పించారు. వివరాలు.. మండలంలోని సోదనపల్లికి చెందిన రైతులు డ్రిప్పు అట్టి రమణ, పేట నాగేశ్వర్‌రెడ్డి పోతురాజు కాల్వ గ్రామం వద్ద ఉన్న అనంతపురం–తాడిపత్రి హైవే, కూతలేరు బ్రిడ్జి వద్ద ఇసుక టిప్పరు ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందిన విషయం విదితమే. గురువారం మృతదేహాలకు అనంతపురం సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజినేయులు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు తరిమెల భాస్కర్ రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్ రెడ్డి, తదితరులు ఆస్పత్రికి వెళ్లి మృతదేహాల వద్ద నివాళులర్పించారు. పోస్టుమార్టు అనంతరం రైతుల మృతదేహాలను సోదనపల్లి గ్రామానికి తీసుకవచ్చారు. కాగా మృతి చెందిన డ్రిప్పు అట్టి రమణ కుమారుడు దక్షిణాఫ్రికా నుంచి శుక్రవారం రానుండడంతో, ఆదే రోజు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

బీసీ హాస్టల్ తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న జడ్జి మంజుల

గుంతకల్లు రూరల్: గుంతకల్లు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి జి.మంజుల గురువారం రాత్రి మండలంలోని పాతకొత్తచెరువు బీసీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ముందుగా హాస్టల్‌లోని ప్రతి గదికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. హాస్టల్‌లో సౌకర్యాలు, భోజనం ఎలా ఉందని ప్రశ్నించారు. అనంతరం చదువు ఎలా సాగుతోందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాత్రి విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దుకాణాల నిర్వహణకు 28న వేలం

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని రెండు దుకాణాలకు ఈ నెల 28న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుత్తిలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న షాపు–2, ఆర్‌ఎస్‌లోని కర్నూల్ రోడ్డులో ఉన్న షాపు–1కు వేలం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు వేలం ప్రారంభమవుతుందన్నారు.

మట్కా బీటర్ అరెస్టు

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి చెందిన నాగేంద్రశెట్టి గొడ్డుమర్రి గ్రామ సమీపంలో మట్కా రాస్తుండగా గురువారం సీఐ సత్యబాబు, ఎస్ఐ శ్రీరామ ప్రసాద్ తమ సిబ్బందితో దాడులు చేసి మట్కా పట్టీలు, రూ.30,200 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారు మాట్లాడుతూ మట్కా బీటర్‌పై కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించామన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఏఈగా విజయకుమార్



ఏఈని సన్మానిస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

శింగనమల: ట్రాన్స్‌కో ఏఈగా పి.విజయకుమార్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఏఈ విజయకుమార్ గార్లదిన్నె మండలానికి బదిలీ కావడంతో, తాడిపత్రిలో పని చేస్తున్న ఏఈ పి.విజయకుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఏఈకి సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఈ మాట్లాడుతూ ప్రజలు, రైతులకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

నేటి నుంచి పశుగణన

బుక్కరాయసముద్రం/గార్లదిన్నె: అఖిల భారత స్థాయి పశు గణన కార్యక్రమం ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సహాయ సంచాలకుడు డాక్టర్ రత్నాకర్ తెలిపారు. బీకేఎస్, నార్పల మండలాల్లో పశు గణన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. వెటర్నరీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తారన్నారు. అలాగే గార్లదిన్నె మండల వ్యాప్తంగా శుక్రవారం 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ప్రారంభమవుతుందని గార్లదిన్నె పశువైద్యాధికారి రమేష్ తెలిపారు.

జంతు కళేబరాలను పడేస్తే చర్యలు



జంతు కళేబరాల వ్యర్థాలను తొలగించాలని ఆదేశిస్తున్న కమిషనర్ నయీమ్

గుంతకల్లుటౌన్: జంతువులను వధశాలలో కాకుండా ఇళ్ల మధ్యనే వధించి, వాటి కళేబరాలు, ఇతర వ్యర్థాలను ఖాళీ జాగాల్లో పడేసి పరిసరాలను అపరిశుభ్రంగా మారిస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ హెచ్చరించారు. 37వ వార్డులో స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు శానిటేషన్ సెక్రటరీలతో కలసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. జంతువధశాలలోనే వాటిని వధించేలా చర్యలు చేపట్టాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. అనంతరం ఆయన రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించారు. తాగిపడేసిన కొబ్బరి బోండాలను ఖాళీ స్థలాల్లో వేస్తే జరిమానా విధిస్తామని విక్రేతలను హెచ్చరించారు. అంతకుముందు ఆయన 4వ డివిజన్ పరిధిలోని పీహెచ్ వర్కర్ల మస్టర్‌ను, హంపయ్యకాలనీలో పార్క్‌ను పరిశీలించారు.

'పరీక్షలంటే భయం వీడాలి'

గుంతకల్లు: పదో తరగతి విద్యార్థులు పరీక్షల భయం వీడితే మంచి ఫలితాలు సాధించవచ్చని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ సూచించారు. గురువారం పట్టణంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నూర్జహమాత తదతరులు పాల్గొన్నారు.

బోర్డుపై రూ.30.. విక్రయం రూ.50!



రూ.30 మించి విక్రయించకూడదని ఏర్పాటుచేసిన బోర్డు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్ననది ఒడ్డున వెలసిన అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో నిబంధనలకు విరుద్ధంగా టెంకాయల విక్రయం చేస్తున్నా దేవదాయశాఖ అధికారులు అటువైపు దృష్టి సారించకపోవడం విడ్డూరం. దేవస్థానంలో టెంకాయల విక్రయం హక్కును పొందిన వ్యాపారి రూ.30కి మించి టెంకాయల విక్రయం చేయరాదని స్వయానా దేవదాయశాఖ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ అతడు రూ.50కి విక్రయిస్తున్నా ఎటువంటిచర్యలు చేపట్టకపోవడంతో స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు బోర్డును చూసి ఇదెక్కడి విడ్డూరమని ముక్కున వేలేసుకుంటున్నారు. చేసేదేమీలేక రూ.50 పెట్టి టెంకాయ కొంటున్నారు. మరికొందరు టెంకాయకు బదులుగా ఆ డబ్బులను హుండీలో వేస్తున్నారు. ఇదే విషయమై ఈఓ సుబ్రమణ్యంను సాక్షి ఫోన్‌లో ప్రసావించగా టెంకాయలు రూ.50కి విక్రయిస్తున్నట్లు పలువురు భక్తులు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. నిబంధనల మేరకు టెంకాయ రూ.30కే విక్రయించాలని అతడిని హెచ్చరించామన్నారు.

రహదారులపై బ్లాక్ స్పాట్ల గుర్తింపు



గుత్తి మండలం కొత్తపేట వద్ద బ్లాక్‌స్పాట్‌నుపరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

గుత్తి రూరల్/గుత్తి/గార్లదిన్నె: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 44, 67వ నంబర్ జాతీయ రహదారులపై గురువారం పోలీసులు బ్లాక్ స్పాట్లు గుర్తించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాలతో రెండు జాతీయ రహదారులతో పాటుగా జిల్లా సరిహద్దు ఊబిచెర్ల వరకూ ప్రమాదాలు జరిగే బ్లాక్‌స్పాట్లను సిబ్బందితో కలసి డీఎస్పీ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు గుర్తించారు. ముఖ్యంగా రహదారిపై మలుపులు ఉన్న ప్రదేశాలు, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, కూడళ్లలో 'ప్రమాదం జరుగు ప్రదేశాలు' అనే బోర్డులు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ తెలిపారు. గుత్తి పోలీసు స్టేషన్ పరిధిలోని తాడిపత్రి రోడ్డులో మూడు, అనంతపురం రోడ్డులో రెండు బ్లాక్ స్పాట్లను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుళ్లు రమేష్‌నాయక్, జాఫర్ పాల్గొన్నారు. అలాగే గార్లదిన్నె మండలంలోని 44వ జాతీయ రహదారిపై కల్లూరు తరిమెల క్రాస్, కనంపల్లి క్రాస్, తలగాచి పల్లి క్రాస్, గార్లదిన్నెలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ప్రమాదాలు జరిగే స్థలాలు గుర్తించారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలో 186 ఎకరాలు



పెన్నానదిలోని అక్రమణలను పరిశీలిస్తున్న రెవెన్యూ బృందం

పామిడి: పామిడి సమీపంలోని పెన్నానదిలో 186.71 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు రెవెన్యూ సర్వే బందాలు గుర్తించినట్లు తహసీల్దార్ శ్రీధర్ మూర్తి గురువారం తెలిపారు. యథేచ్ఛగా ఆక్రమణలు అన్న సాక్షి శీర్షికపై స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టింది. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆక్రమణలను గుర్తించింది. ఆ వివరాలను తహసీల్దార్ తెలిపారు. 168.55 ఎకరాలను కొందరు ఆక్రమించి పంటలు సాగుచేస్తున్నారన్నారు. అలాగే ఇటుకల కర్మాగారాలకు సంబంధించి 8.2 ఎకరాలు, 2.65 ఎకరాల ఆక్రమణలో 8 షెడ్ల ఏర్పాటు, 5 ఎకరాల ఆక్రమణలో 4 శ్మశానవాటికల ఏర్పాటు, 2.01 ఎకరాల్లో పశుక్షేత్రాలు ఏర్పాటు, 0.3 ఎకరాల ఆక్రమణలో దేవాలయాల నిర్మాణాలతో కలిపి 186.71 ఎకరాల్లో నదీ ఆక్రమణలను గుర్తించామన్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామన్నారు.

సంక్షిప్త సమాచారం

భూ సమస్యలను పరిష్కరిస్తాం

శింగనమల: రీ–సర్వే చేసిన గ్రామాల్లో రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు. గురువారం మండలంలోని నిదనవాడలో గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి రైతులు సహకరించాలన్నారు. మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి

గుత్తి రూరల్: బాణా సంచా విక్రేతలు నిబంధనలు పాటించి విక్రయాలు సాగించాలని తహసీల్దార్ ఓబిలేసు, ఎస్ఐ సురేష్ సూచించాచారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాణా సంచా విక్రేతలతో వారు సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగానే పట్టణంలోని ఎంఎస్ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దుకాణాల్లో అనుమతులు ఉన్న టపాసులను మాత్రమే విక్రయించాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరిగితే నివారించేందుకు ప్రతి దుకాణం వద్ద డ్రమ్ములో నీరు, ఇసుక నిల్వ ఉంచుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.

వినూత్న ఆవిష్కరణల దిశగా సాగాలి

గుంతకల్లు: విద్యార్థులు ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటూ వినూత్న ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో ప్రజ్వలన్ సృజన్ ఫేస్ట్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కరస్పాండెంట్ కేసీ హరి, కళాశాల చైర్మన్ మురళీకృష్ణ, ప్రముఖ వైద్యురాలు సరోజమ్మ, మాజీ ప్రిన్సిపాల్ ఆర్‌కే నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆవిష్కరించిన వినూత్న ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేష్‌బాబు, అధ్యాపకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, బి.కృష్ణయ్య, పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంపచెట్ల తొలగింపు

శింగనమల: నియోజకవర్గ కేంద్రమైన శింగనమలకు మరవకొమ్మ క్రాస్ నుంచి వచ్చే రహదారికి ఇరువైపులా కంప చెట్లు విపరీతంగా పెరిగిపోయాయి. కంపచెట్లు రోడ్డు మధ్యలోకి రావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ ఆండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో సర్పంచ్ నాగమునెమ్మ, ఎంపీడీఓ నిర్మలాకుమారి స్పందించి 3 కిలో మీటర్ల మేర రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను జేసీబీతో తొలగించారు. దీంతో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలి

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం ఉచిత గ్యాస్ పథకంలో బ్యాంకులో నగదు జమ చేయకుండా మహిళలకు ఉచితంగా సిలిండర్లు పంపిణీ చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రతి ఇంటికీ మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అయితే దీపావళి నుంచి దీపం పథకం కింద గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకుంటే, బ్యాంకు ఖాతాలో నగదు జమ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు.

లింగ వివక్ష నిర్మూలకు కృషి

బుక్కరాయసముద్రం/యల్లనూరు: లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రిన్సిపాల్ నాగమణి సూచించారు. గురువారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బాల్య వివాహాలు, గర్భస్థ లింగ నిర్ధారణ నియంత్రణ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు చిన్న వయస్సులో పెళ్లి చేయడం చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ, గర్భంస్రావం చేయించుకుంటున్నట్లు తెలిస్తే 9849902397కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మోహన్‌రావు, ఫాతిమా, సత్య నారాయణ, ధనుంజయ, జయంతి అంజినమ్మ, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే యల్లనూరు మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు గురువారం లింగ నిర్ధారణపై వైద్యుడు లోకేష్ కుమార్ అవగాహన కల్పించారు.

తప్పిన పెను ప్రమాదం

అనంతపురం (నార్పల): నార్పల మండలం కేశేపల్లి గ్రామంలో పెనుప్రమాదం తప్పింది. ఇటీవల కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలింది. ఉదయం 11 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన నారాయణ, వెంకటలక్ష్మి కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు. అందరికీ వివాహాలయ్యాయి. దంపతులు మాత్రమే ఇంట్లో నివాసముంటున్నారు. గురువారం వారు కూలి పనులకు వెళ్లిన సమయంలో ఇల్లు కూలడంతో ప్రాణాపాయం తప్పింది. అధికారులు స్పందించి బాధితులను ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు



రావులుడికి గ్రామంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ ఆంజనేయులు

యాడికి(పెద్దవడుగూరు): గ్రామాల్లో ఎవరైనా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. గురువారం పెద్దవడుగూరు మండలంలోని భీమునిపల్లి, కోనాపురం, రావులుడికి, చింతలచెరువు గ్రామాల్లో ఎస్ఐ తన సిబ్బందితో కలసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట, మట్కా తదితర అసాంఘిక కార్యక్రమాలపై సమాచారం ఇవ్వాలన్నారు. అంతకుముందు ఎస్ఐ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై పోలీసు అమరవీరుల త్యాగాలను వివరించి, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు బిల్‌కిష్ బేగం తెలిపారు. అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు అమృత, అఖిల, అండర్–17 విభాగంలో చంద్రిక, హారిక, గౌతమి, అండర్– 14 బాలురు విభాగంలో పనీంద్ర, అండర్–17 విభాగంలో నరసింహుడు, అఖిల్ కుమార్ ఎంపికయ్యారు. జిమ్నాస్టిక్ అండర్–14 బాలురు విభాగంలో ప్రేమానందం, శ్రీమన్నారాయణ, అండర్–14 బాలికల విభాగంలో నందిని, మౌనిక, అండర్–17 విభాగంలో కామిని ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలితోపాటుపీడీ వరలక్ష్మి, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ద్విచక్ర వాహనం బోల్తా

- ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో రవి, రమేష్ గాయపడ్డారు. వారు బైక్‌లో ఆర్‌ఎస్‌కు వెళుతుండగా రోడ్డుకు అడ్డంగా కుక్క వచ్చింది. కుక్కను తప్పించబోయి బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

పామిడి: కార్డుదారులకు రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని సీఎస్‌డీటీ కంబక్క సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సభా భవనంలో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే రేషన్ సరుకులను లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. తూకాల్లో అవకతవకలకు పాల్పడే డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో డీలర్లు నారాయణ మూర్తి, వెంకట్రామిరెడ్డి అలియాస్ దేవుడు, బాబు, వీరారెడ్డి, తులశమ్మ, ఎండీయూ ఆపరేటర్లు బషీర్, శివ పాల్గొన్నారు.

ఇళ్లపై హైటెన్షన్ వైర్లను తొలగించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని అల్లీపీరా కాలనీలో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కె.వి. విద్యుత్ హైటెన్షన్ లైన్లను తొలగించాలని ట్రాన్స్‌కో ఏడీఈ నాగేంద్రను సీపీఎం నాయకులు కోరారు. గురువారం విద్యుత్ నిలయంలో ఏడీఈని సీపీఎం పట్టణ ప్రధాన కార్యదర్శి బి.శ్రీనివాసులు, నాయకులు మారుతి, నాగరాజు, కాలనీవాసులు కలిసి వినతిపత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు.

యర్రగుంట్లలో చిరుత సంచారం

గార్లదిన్నె: మండలంలోని యర్రగుంట్ల గ్రామ సమీపంలోని పొలాల్లో కొద్ది రోజులుగా చిరుత పులి సంచరిస్తున్నట్లు రైతులు గుర్తించారు. చిరుత పులి అడుగు జాడలు కనిపించడంతో గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి చిరుతలు పొలాల్లోకి వచ్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో తోటల వద్దకు వెళ్లేందుకు రైతులు, కూలీలు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల యర్రగుంట్లలో చిరుత ఒక గొర్రెపై దాడి చేసి చంపినట్లు గ్రామస్తులు వాపోయారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను గుర్తించి, అటవీ ప్రాంతంలోకి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


సైబర్ నేరాలపై అప్రమత్తం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

తాడిపత్రిటౌన్: సైబర్ క్రైం మోసాలపై అప్రమత్తంగా ఉండాలని తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సూచించారు. మండలంలోని చుక్కలూరు హైస్కూల్‌లో విద్యార్థులకు పోలీస్ అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని సైబర్‌క్రైం పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వాడకంపై విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి, ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ధరణిబాబు, హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మారక ద్రవ్యాల వినియోగం నేరం



మాట్లాడుతున్న సబ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరి

బుక్కరాయసముద్రం: విద్యార్థులు మారక ద్రవ్యాల వినియెగానికి దూరంగా ఉండాలని సబ్ ఇన్‌స్పెక్టర్ శేషగిరి సూచించారు. గురువారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ విద్యార్థులకు హ్యుమానిటీస్, సైన్సెస్ విభాగం, ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఐఐసీ) నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్‌ఎస్‌ఎస్) సంయుక్తంగా మారక ద్రవ్య వ్యతిరేకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మారద ద్రవ్య నిర్మూలకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.